తాసీల్దార్‌లతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ధరణి సమస్యలు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి

- అధికారులు అవినీతికి పాల్పడి అభాసుపాలు కావొద్దు
- వనపర్తి ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి, జూలై 4: ధరణి సమస్యలను అదనుగా చేసుకొని రైతులు, ఇతరులను ఇబ్బందులకు గురిచేసి అధికారులు అభాసు పాలుకావొద్దని వనపర్తి ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి సెలవుపై వెళ్లడంతో గురువారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్‌గా సంచిత్ గంగ్వార్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో తాసీల్దార్లు, ఆర్డీవోలతో ధరణి దరఖాస్తుల పరిష్కారంపై వెబ్‌ఎక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది లంచాలు తీసుకోవడం వంటి దుశ్చర్యలకు పాల్పడొద్దని, ఇలాంటివి తన దృష్టికి వస్తే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో అధికారులు వరుసగా ఏసీబీ దాడుల్లో పట్టుబడటంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లాలో ఏ ఒక్క అధికారి లంచం తీసుకోవడం, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ప్రభుత్వ అధికారులపై ప్రజలకున్న నమ్మకాన్ని పోగొట్టుకుంటామన్నారు. అలాగే లంచం తీసుకునే ఉద్యోగి జైలుకు వెళ్లడమే కాకుండా వారి కుటుంబం వీధిన పడుతుందన్నారు. ధరణి దరఖాస్తులు పరిష్కరించడంలో అధికారులు పారదర్శకంగా పనిచేస్తూ వేగం పెంచాలన్నారు. పెండింగ్ మ్యుటేషన్, సక్సేషన్, పాస్‌బుక్‌లో కరెక్షన్, కోర్టు కేసుల సమాచారం వంటి దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, తాసీల్దార్లు పాల్గొన్నారు.

బాలకార్మిక నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు

- జోగులాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, జూలై 4: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ 10వ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పిపోయిన, పాఠశాలకు వెళ్లని పిల్లలను గుర్తించడం, భిక్షాటన, బాలకార్మికులు, మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి తదితర వాటిలో నిమగ్నమైన వారిని రక్షించే లక్ష్యంతో చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ 10 పనితీరుపై చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో బాలకార్మిక వ్యవస్థ ఒక వ్యాధిలా మారిందని, ఎంతోమంది అమాయక పిల్లల బాల్యాన్ని నాశనం చేస్తోందన్నారు. ప్రధానంగా తల్లిదండ్రుల పేదరికంతో పిల్లలు వెట్టిచాకిరి కోరల్లో చిక్కుకొని తమ బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా, తమ పిల్లలను మాత్రం వెట్టిచాకిరి కూపంలోకి నెట్టకూడదని, పిల్లల చదువు కోసం ప్రభుత్వం ఉచితంగా ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెట్టి చాకిరి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని, ప్రజలు కూడా దాన్ని తమ నైతిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్ జూలై 1వ తేదీ నుంచి మొదలై 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సహదేవుడు, సభ్యులు జయభారతి, శైలజ, అధికారులు మహేశ్‌కుమార్, కేశవరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే లేకుండానే హెల్త్ సెంటర్ ప్రారంభమా ?

గోపాల్‌పేటలో మాట్లాడుతున్న మంద సత్యశీలారెడ్డి

గోపాల్‌పేట, జూలై 4: ఖిల్లాఘణపురం మండలంలోని కర్నెతండాలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి బుధవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి లేకుండానే డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పార్టీ నాయకులతో కలిసి ప్రోటోకాల్ పాటించకుండా ప్రారంభించడమేంటని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండల ఇన్‌చార్జి మంద సత్యశీలారెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కర్నెతండాలో పీహెచ్‌సీ ప్రారంభంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్యే మేఘారెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మేఘారెడ్డి దొడ్డిదారిన ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకొని గెలిచాడని అంటుంటే.. చిన్నారెడ్డి పక్కనే ఉండి ఏమీ అనకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మెజార్టీ ఎమ్మెల్యేలు గెలిస్తేనేగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, అందువల్లేగా చిన్నారెడ్డికి ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి లభించిందని, అది మరిచి టికెట్ కేటాయించిన ఇండియా కూటమిని కించపరిచేవిధంగా మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పార్టీ క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడిగా ఉన్న చిన్నారెడ్డికి ఇవి పట్టవా అని విమర్శించారు. మన పార్టీ వారిని మనమే గౌరవించుకోకుంటే ఎవరు గౌరవిస్తారన్నారు. గ్రూపు రాజకీయాలు మాని కలిసిమెలిసి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని హితవుపలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్, శివన్న, నాగశేషు, ఖలీల్, బాలపీరు, బాలయ్య, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకటయ్య, శాతయ్య, పార్థసారధి, శంకర్, నాగరాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325758

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

దొడ్డి కొమురయ్య జీవితం స్ఫూర్తిదాయకం

- జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్
- కలెక్టరేట్, జెడ్పీ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి
- చిత్రపటం వద్ద నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జెడ్పీ చైర్మన్ లోకనాథరెడ్డి

వనపర్తి, జూలై 4: తెలంగాణ సాయిధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య జీవితం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాం నవాబుల ఆగడాలకు వ్యతిరేకిస్తూ తెలంగాణ సాయిధ పోరాటంలో పాల్గొని తొలి అమరుడయ్యాడని గుర్తు చేశారు. నిజాం నిరంకుశ పాలనలో స్వేచ్ఛ లేదని, రైతులు, మహిళలపై జరిగిన అన్యాయాలను అడ్డుకొని తన ప్రాణాలను కోల్పోయారని కొనియాడారు. స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన అమరవీరులను ఎప్పటికీ మరిచిపోవద్దని, మహనీయుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రం, దేశం అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని సూచించారు.

జెడ్పీలో స్వామి వివేకానంద, కొమురయ్య వర్ధంతి

జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వామి వివేకానంద, దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి సుబ్బారెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికారులు, కులసంఘాల నాయకులు నాగరాజు, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి అందరి సహకారం అవసరం

జెడ్పీవైస్ చైర్‌పర్సన్ సరోజమ్మ దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీవో సిబ్బంది

మానవపాడు , జూలై 4 :గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులతోపాటు ఉద్యోగుల సహకారం కూడా చాలా అవసరమని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీల వీడ్కోలు సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ అశోక్‌రెడ్డి, జెడ్పీటీసీ సరిత, ఎంపీటీసీలను అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి

విద్యార్థుల భవిష్యత్‌కు చదువు పునాది లాంటిదని, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మండలంలోని జల్లాపురం జెడ్పీఉన్నత పాఠశాలలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన భవనాలను గురువారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సోమన్నగౌడ్, కోఆప్షన్ సభ్యుడు సిరాజ్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికారులదే కీలక పాత్ర

ధరూరు, జూలై 4: మండలాభివృద్ధిలో ప్రజాప్రతినిధులుగా విజయం సాధించడంలో అధికారులు కీలకపాత్ర పోషించారని వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మంజుల అధ్యక్షతన ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నజుమున్నిసాబేగం సహచర ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మంజుల, ఎంపీవో కృష్ణమోహన్, సూపరింటెండెంట్ ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు బండ్ల విజయ్, రాజారెడ్డి, వెంకటేశ్‌నాయుడు, దేవదాసు పాల్గొన్నారు.

ఎంపీపీ దంపతులకు సన్మానం

కొత్తకోట, జూలై 4: కొత్తకోట ఎంపీపీ గుంతమౌనిక, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేశ్‌ను ఎంపీటీసీలు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేత శ్రీనివాసులు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో ఎంపీపీ గుంతమౌనిక కొత్తకోట మండలాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ప్రధానంగా కనిమెట్టను అభివృద్ధిలో ముందుంచారని, ఎంపీటీసీలకు నిధులు వెచ్చించి గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, పద్మ, లక్ష్మి, శేషిరెడ్డి, రంగారెడ్డి, లక్ష్మణ్‌నాయక్, అల్లాబాషా, శివశంకర్‌రెడ్డి, గోవిందు నాయుడు, మిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం

గద్వాల రూరల్, జూలై 4:ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజాప్రజానిధులను సన్మానించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సరోజమ్మ, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, ఎంపీటీసీలు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, పంచాయతీ రాజ్ ఏఈ బషీర్, వైస్ ఎంపీపీ దామోదర్, ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తకోటలో ఎంపీపీ గుంతమౌనిక దంపతులను సన్మానిస్తున్న ఎంపీటీసీలు

ఐదేండ్లలో పారదర్శక పాలన

- జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

వనపర్తి, జూలై 4: జెడ్పీ చైర్మన్ పదవి చేపట్టి ఐదేండ్లు పూర్తి కావోస్తున్న కాలంలో ప్రజలకు పారదర్శకంగా సేవ లందించామని జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఐదేండ్లలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11కోట్లకుతో 550పనులను చేపట్టామన్నారు. వీటిలో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులపై ఖర్చు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోనే ఎలాంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా జెడ్పీటీసీల సమన్వయంతో నిధులను సద్వినియోగం చేసుకోగలిగామన్నారు.

ప్రత్యేకాధికారుల నియామకం

పెబ్బేరు/ఆత్మకూరు/ ఖిల్లాఘణపురం/ అమరచింత/ పెద్దమందడి,జూలై 4: ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండడంతో వారి స్థానాల్లో ప్రభుత్వం జిల్లాస్థాయి యంత్రాంగాన్ని ప్రత్యేకాధికారులుగా నియమించింది. పెబ్బేరు ప్రత్యేకాధికారిగా డీఆర్డీవో నాగేంద్రం నియమితులయ్యారు. అలాగే శ్రీరంగాపురానికి జిల్లా షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారిణి నిషిత, ఆత్మకూరుకు బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి, ఖిల్లాఘణపురానికి డీటీడీవో శ్రీనివాసులు , అమరచింతకు డీపీవో రమణామూర్తి, పెద్దమందడి మండల ప్రత్యేకాధికారిగా వేణుగోపాల్ గురువారం బాధ్యతలు చేపట్టారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

గద్వాలటౌన్, జూలై 4: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి ఆరోపించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళా మోర్చ ఆధ్వర్యంలో గురువారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా హామీలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గెలిచిన తర్వాత కాంగ్రెస్ గాలికి వదిలేసిందని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తాసీల్దార్ శివకుమార్ వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు బండల పద్మావతి, జయశ్రీ, వెంకటమ్మ, లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

వనపర్తి టౌన్, జూలై 4: సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికను ఈనెల 7న ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణకుమార్‌రెడ్డి, తిరుపతి తెలిపారు. ఆదివారం ఉదయం 8గంటలకు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెబ్బేర్‌లోని పేజీపీ క్యాంపు గ్రౌండ్‌లో ఎంపికలు ఉంటాయని, 2011-12 సంవత్సరాల మధ్య జన్మించిన క్రీడాకారులు ఎంపికకు అర్హులని చెప్పారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా క్రీడాకారులు మాత్రమే ఎంపికలో పాల్గొనాలని చెప్పారు.

ఆవిర్భావాన్ని ఘనంగా నిర్వహించాలి

ఆత్మకూరు, జూలై 4: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. 30 వసంతాల ఆవిర్భావ వేడుకలను నిర్వహించే క్రమంలో గురువారం మండలంలోని తిప్పడంపల్లిలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. గ్రామంలో జెండా కట్టను ఏర్పాటు చేసి జెండా కార్యక్రమం నిర్వహించేందుకు తగిన సూచనలు చేశారు. ఈనెల 7న ఊరూరా ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు భాస్కర్, ఆయా గ్రామాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు

- జిల్లా సంక్షేమ అధికారిణి లక్ష్మీబాయి
- అంగన్‌వాడీ టీచర్, వర్కర్‌కు మెమోలు

ఆత్మకూరు, జూలై 4: విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా సంక్షేమ అధికారిణి లక్ష్మీబాయి సూచించారు. గురువారం ఆత్మకూరులోని ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విధులపై బాధ్యతారాహితంగా వ్యవహరించినందుకు, లబ్ధిదారులకు చెడిపోయిన గుడ్లను పంపిణీ చేసినందుకు, అంగన్‌వాడీ కేంద్రంలో తినిపించకుండా లబ్ధిదారుల ఇండ్లకే టిఫిన్ బాక్స్‌లు పంపిన నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్ సంగీత, వర్కర్ లక్ష్మికి శ్రీముఖాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కాలనీలోని గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే భోజనం, గుడ్లు సెంటర్‌లోనే తినాలని పేర్కొన్నారు. ఎవరికీ ఇండ్లకు పంపించరాదని స్పష్టం చేశారు. ఏవైనా కారణాలతో లబ్ధిదారుల ఇండ్లకు టిఫిన్‌బాక్స్‌లు పంపితే టీచర్, ఆయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులకు అందించే ప్రతి ఆహార పదార్థాన్ని పరిశీలించి పంపిణీ చేయాలని సూచించారు. ఈ మధ్య కాలంలో గుడ్లు సక్రమంగా రావడంలేదని లబ్ధిదారులు అధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో భారతి, సూపర్‌వైజర్లు శ్రీలత, సబిత, నర్మద పాల్గొన్నారు.

ఇన్నోవా ఢీకొని వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు

కొత్తకోట, జూలై 4: పట్టణ సమీపంలో పాలెం బైపాస్ రోడ్డు వద్ద బస్సు కోసం నిలుచున్న వ్యక్తిని ఇన్నోవా ఢీకొని మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకున్నట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గద్వాల జిల్లా కొండపల్లికి చెందిన రామాంజనేయులు (38), ఈరన్న హైదరాబాద్‌లో కూలి పని చేయడానికి బుధవారం సాయంత్రం స్వగ్రామం నుంచి బయలుదేరారు. కొత్తకోటకు వచ్చాక బస్సులు రాకపోవడంతో బైపాస్ రోడ్డు వద్ద బస్సు కోసం వేచి ఉన్నారు. రాత్రి 10గంటల సమయంలో ఇన్నోవా రామాంజనేయులును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో ఈరన్నకు కూడా బలమైన గాయలయ్యాయి. ఈరన్నను కర్నూలు దవాఖానకు తరలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

తండాల్లో ఎక్సైజ్ దాడులు

అమరచింత, జూల్ 4: మండలంలోని చంద్రనాయక్ తండా, కొత్తతండా, అమరచింత మున్సిపాలిటీలోని రెండో వార్డు తండాలో గురువారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ఇంట్లో రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎక్సైజ్ అధికారి కృష్ణకాంత్ తెలిపారు. డీటీఎఫ్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న తండాల్లో దాడులను నిర్వహించగా.. అమరచింత కొత్తతండాలో రెండు లీటర్ల సారాను పట్టుకుని పారబోసి ఇంటి యాజమానిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ షేక్‌నిరంజన్, రమేశ్‌కుమార్, జనార్దన్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

వనపర్తి, జూలై 4: మండలంలో రూరల్ పోలీసుస్టేషన్ వద్ద చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడి ఇద్దరికి కోర్టు రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన రామాంజనేయులు, రామచంద్రయ్యకు డ్రంకెన్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనం నడపడంతో రూరల్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. దీంతో జడ్జి వారికి రెండు రోజుల జైలు శిక్ష విధించడంతో వారిని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

వ్యాధినివారణ టీకాలు పంపిణీ

వడ్డేపల్లి, జూలై 4 : మండలంలోని కోయిలదిన్నె గ్రామంలో గురువారం పశువైద్యాధికారి పుష్పలత ఆధ్వర్యంలో ఆవులు, ఎద్దులకు లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 128ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు తెలిపారు. రైతులు పశువులకు ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలని సూచించారు. ఈ శిబిరంలో వీఎల్‌వో వరప్రసాద్, ఎల్‌ఎస్‌ఎ ఎండీ షైక్ లతీఫ్, ఓఎస్ రవి, వెంకటమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించిన మహిళ పై కేసు

పాన్‌గల్, జూలై 4: మండల కేంద్రానికి చెందిన ఆది సునీతపై గురువారం కేసు నమోదైనట్లు ఎస్సై కల్యాణ్‌రావు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఆర్టీసీ బస్సు దిగేసమయంలో ఆది సునీత తోటి ప్రయాణికులతో గొడవపెట్టుకోవడమే కాకుండా బస్సు అద్దాలు ధ్వంసం చేసి బస్సు డ్రైవర్, కండక్టర్‌ను దుర్భాషలాడింది. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

అమరచింత, జూల్ 4: మండలంలోని త్యూకానాయక్‌తండా శివారులో బొలేరోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం మేరకు గురువారం దాడి చేసి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సురేశ్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసిన 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకు బొలేరోలో తరలిస్తుండగా పట్టుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

- అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

గట్టు, జూలై 4: విద్య, వైద్యంతోపాటు గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే ఆ గ్రామం ఆదర్శంగా రూపుదిద్దుకుంటుందని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. గురువారం మండలకేంద్రంలో నీతి అయోగ్ ఆధ్వర్యంలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్‌తోపాటు నీతి అయోగ్ ఢిల్లీ ప్రతినిధి శ్రీయనాయర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీతి అయోగ్ ద్వారా దేశంలోని 500 మండలాలను వెనుక బడిన మండలాలుగా గుర్తించామన్నారు. అందులో పూర్తిగా వెనుకబడిన మండలంగా గట్టు కూడా ఉందన్నారు. ఈనెల 4నుంచి వచ్చేనెల 30వ తేదీవరకు ఆరు అంశాలపై అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య చికిత్సలు, బాలింతలకు పౌష్టికాహారం అలాగే 30 ఏండ్లు పైబడిన వారిలో రక్త పుట, మధుమేహం, వ్యాధులను గుర్తించడం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ వందశాతం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమాధికారిణి సుధారిణి, డీవో గోవిందనాయక్, వైద్యాధికారులు, ఎంపీడీవో చెన్నయ్య, అంగన్ వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఎంపీపీ విజయ్, జెడ్పీటీసీ శ్యామల పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి

వనపర్తి టౌన్/ఖిల్లాఘణపురం, జూలై 4: తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి, మాజీ ప్రధాని గుల్జారి నంద జయంతి, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతిని గురువారం ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కేంద్రం, ఖిల్లాఘణపురంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్, కవి పండితులు గిరిరాజాచారి, డాక్టర్ నర్సింహశర్మ, నాగరాజు, దేవన్ననాయుడు, బాలేమియా, సామాజిక కార్యకర్త కమ్మరి గోపి మాజీ సర్పంచు కృష్ణయ్యగౌడ్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు భూమయ్య, బాలకిషన్ ఉన్నారు.

నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎస్పీ

వనపర్తి టౌన్, జూలై 4: మానవ అక్రమ రవాణా నిరోధక విభాగ కార్యాలయాన్ని ఎస్పీ రక్షితామూర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతుందని, మానవ అక్రమ రవాణాను నిర్మూలించడానికి యాంటి ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆకతాయిల వల్ల మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే మహిళా హెల్ప్‌లైన్ 1091, 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 112, సైబర్ క్రైం 1930 నెంబర్లకు ఫోన్ చేసి వాట్సాప్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో బీసీ ఆర్పీ డీఎస్పీ కృష్ణకిశోర్, సైబర్ క్రైం డీఎస్పీ రత్నం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ముని, రవిపాల్, అంజద్, షీటీమ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పాన్‌గల్, జూలై 4: పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్, సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి సూర్యవంశం రాము మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికల హామీలను తూచతప్పకుండా అమలు చేయాలని, పెరగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీవో రఘురాములుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వనపర్తి, జూలై 4: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను నెరవర్చాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఏవో భానుప్రసాద్‌కు బీజేపీ మహిళా అధ్యక్షురాలు అశ్వినీరాధ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా మహిళలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. ఇప్పటివరకు ఒక్క ఉచిత బస్సు ప్రయాణ అవకాశం కల్పించి మిగితా హామీలను గాలికొదిలేసిందని ఎద్దేవా చేశారు. మహాలక్ష్మి కింద ఇస్తామన్న రూ.2500లను కనీసం జనవరి నుంచి బకాయిలు కలిపి నేటివరకు రూ.15వేలు అందించాలని పేర్కొన్నారు. నవ వధువుకు తులం బంగారంతోపాటు కల్యాణలక్ష్మి రూ.లక్షను డిసెంబర్ నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో జిల్లాలో పెద్ద ఎత్తున బీజేపీ ఆధ్వర్యంలో మహిళలతో ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు రాము, రాష్ట్ర మహిళా కార్యదర్శి జ్యోతిరమణ, కల్పన, అలివేలమ్మ, సుమిత్రమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా..

- బీఆర్‌ఎస్ జిల్లా కోఆప్షన్ సభ్యుడు నిషాక్

రాజోళి, జూలై 4 : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ అభివృద్ధి తన వంతు కృషి చేస్తానని ఉంటుందని బీఆర్‌ఎస్ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్ అన్నారు. గురువారం పాఠశాలకు నూతనంగా వచ్చిన జీహెచ్‌ఎం భగీరథరెడ్డిని కలిసి సన్మానించారు. అనంతరం పాఠశాలలో మరమ్మతు పనులు నిలిచాయని, పూర్తి కావడానికి కృషి చేస్తామన్నారు.

నీట్‌స్కామ్‌పై విచారణ చేపట్టాలి

పాన్‌గల్, జూలై 4: నీట్‌స్కామ్‌పై సమగ్ర విచారణ జరిపించి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంధు పిలుపులో భాగంగా గురువారం మండలకేంద్రంతోపాటు కేతేపల్లి, రేమద్దుల పాఠశాలల్లో తరగతులను బహిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఏర్పాటుకు పనులు ప్రారంభం

రాజోళి, జూలై 4: మండల కేంద్రంలో ఉర్దూ పాఠశాలలో కస్తూర్బా పాఠశాల ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం అధికారులు పనులు ప్రారంభించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా మంజూరైన రూ.7లక్షల నిధులతో పంచాయతీ రాజ్ అధికారి డీఈ అంజనేయులు ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. కార్యక్రమంలో పీఆర్‌ఈ లక్ష్మీనారాయణ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దస్తగిరి, ఎస్‌వో చంద్రకళ పాల్గొన్నారు.

పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి

అయిజ, జూలై 4 : పట్టణంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ దేవన్న పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఆయన పర్యటించి వార్డు ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.